teluguislam.net



# 19. సఫర్ మాస నవీన పోకడలు

**ముస్లిం సోదరులారా, యువకులారా..!**

ఖుత్బాలో తర్జుమాతో పాటు మీరు విన్న ఖుర్‌ఆన్ ఆయత్ షూరా సూరా లోనిది. ఆ సూరా మక్కాలో అవతరించింది. హిజ్రత్ కంటె ముందు అవతరించిన సూరాలను మక్కీ సూరాలంటారు. హిజ్రత్ తరువాత అవతరించిన సూరాలను మదనీ సూరాలుగా వ్యవహరిస్తారు. మక్కావాళ్ళు ఇబ్రాహీమ్ షరీఅత్ పేరుతో రకరకాల నూతన పద్ధతులే కాకుండా బహుదైవారాధన, సత్యతిరస్కారానికి సంబంధించిన ఎన్నో విషయాలను కూడా అందులో జొప్పించారు. అంతటి పాపానికి ఒడిగట్టిన మక్కావాళ్ళని అల్లాహ్ తీవ్రంగా హెచ్చరించాడు. వారు తలపెట్టిన కార్యం ఎంత ఘోరమైనదంటే ఒకవేళ అల్లాహ్ ప్రళయదినాన్ని తీర్పుదినంగా నిర్ణయించి వుండకపోతే వారికి ప్రపంచంలో అక్షణమే శిక్ష విధించబడేది. అలాంటి పాపకార్యాల్లో ఒకటి తమ స్వప్రయోజనాలకోసం అలాహ్ నిర్ణయించిన మాసాలను కూడా మార్పు చేర్పులు చేసేవారు. ముహర్రమ్ మాసంలో యుద్ధాలు చేయటం నిషిద్ధం. కాని వారు చేయాల్సి ఉంటే ఆ నెలను సఫర్ నెలగా ప్రకటించుకుని యుద్ధం చేసేవారు. ఇలాంటి సాకులతో, మాటలలో ఇబ్రాహీమ్ ధర్మాన్ని వీరంతా కలగాపులగం చేసి దాని రూపురూఖలనే మార్చివేశారు.

**మహాశయులారా..!**

హిజ్రీ సంవత్సరకాలమానం ప్రకారం సఫర్ మాసం ముహర్రం మాసం తరువాత వచ్చే 2వ మాసం. సఫర్ అంటే శూన్యం అని అర్థం. ఈ పదాన్నే ఉర్దూ భాషలో సిఫర్ అని అంటారు. ఈ మాసం శుభ, సమృద్ధితో ఖాళీగా ఉంటుందన్నది ముష్రిక్కుల నమ్మకం. అందుకే ఈ మాసాన్ని సఫర్‌గా దారిద్ర్యానికి ప్రతీకగా భావించే వారు. వివాహకార్యాలు ఇతర శుభకార్యాలు ఈ మాసంలో చేసేవారు కాదు. కాని దైవ ప్రవక్త(స) స్పష్టమైన పదాలతో ఇలా ప్రవచించారు:

అల్లాహ్ ఆజ్ఞ లేకుండా ఒకరి వ్యాధి ఇంకొకరికి సోకదు. అపశకునాలు

చూడటం సరియైన పద్ధతి కాదు. సఫర్ మాసం దారిద్రపు మాసం కాదు.

మక్కావాసులు సఫర్ మాసంలో దోపిడి, దొంగతనానికి, దొమ్మీలకు బయలు దేరి ఇళ్ళను ఖాళీగా వదిలేసి సఫరల్ మకాన్ అనేవారు. అంటే సఫర్ మాసం వచ్చింది ఇళ్లు ఖాళీ అయ్యాయి. అని అర్థం.

దైవ ప్రవక్త (స) ఇలాంటి అనాచార, దూరాచారాల మూఢ నమ్మకాలన్నింటిని ఖండించారు. వారించారు. సఫర్ మాసాన్ని దరిద్రపు మాసంగా భావించడం పాపం అని హెచ్చరించారు.

కాని చాలా విచారకర విషయం ఏమిటంటే నామమాత్ర ముస్లింలు కొందరు ఇలాంటి ఎన్నో దురాచార, అనాచార, మూఢ నమ్మకాలను విశ్వసిస్తారు. సఫర్ మాసాన్ని తేరాతేజీ పేరుతో పాటిస్తారు. అంటే సఫర్ మాసంలో మొదటి 13 రోజులు మరి చెడ్డవని అర్థం. ఈ కాలంలో ఎలాంటి మంచి పనులు శుభకార్యాలు చేయరు. అంతేకాక ఈ కాలంలోని దారిద్ర్యాన్ని దూరం చెయ్యటానికి శనగ గింజలను ఉడకబెట్టి పంచుతారు. ఈ విధంగా మొదటి 13 రోజులు చేస్తారు. దైవధర్మంలో కొత్తపుంతల నుండి అల్లాహ్ శరణుకోరుతున్నాను.

**సోదరులారా..!**

తమను తాము ముస్లింలుగా చెప్పుకునే వారి పరిస్థితి ఇది! ఈ మాసంలోని చివరి బుధవారం కుండలు నింపే పండుగ జరుపుకుంటారు. ఇదే చివరి బుధవారం దైవ ప్రవక్త (స) అనారోగ్యం నుండి స్వస్థత పొంది బయటకువచ్చారనీ, అందుకే ఆ సంతోషంలో ఈ పండుగ జరుపుకుంటామని భావిస్తారు. వాస్తవానికి ఇస్లామీయ షరీఅత్ ప్రకారం ఇవన్నీ దురాచారాలు, తప్పుడు అభిప్రాయాలు, నవీన పోకడలు. దైవ ప్రవక్త (స) జీవిత చరిత్ర కనుక అధ్యయనం చేస్తే వారి ఆ నమ్మకం పొరపాటని బోధపడుతుంది. వాస్తవానికి దైవ ప్రవక్త (స) సఫర్ మాసంలోని చివరి వారంలోనే అస్వస్థత ప్రారంభమైంది. కుండలు వంటి వారి ఈ నవీన కార్యం చరిత్ర ప్రకారం పెద్ద పొరపాటే కాదు. ఇదొక కల్పితం. దైవ ప్రవక్త (స) మీద అభాండం. అబద్ధం, షరీఅత్‌లోలేని ఇలాంటి కొత్త పనులనే, కొత్త నమ్మకాలనే బిద్అత్ (నవీన పోకడ) అంటారు. సఫర్ మాసాన్ని చెడు మాసంగా భావించటం మొదటి 13 రోజులను తేరాతేదీగా జరపటం, చివర్లో కుండలు వండటం ఇవన్నీ బిద్అత్ పనులు,

teluguislam.net



బిద్అత్‌లకు ఇస్లాంలో ఎలాంటి స్థానం లేదు. కాబట్టి ఈ అక్షర సత్యాన్ని గ్రహించి షరీఅత్‌కు విరుద్ధంగా నడుచుకుంటున్న సోదరులు ఇస్లాం వైపుకు, దైవ ప్రవక్త విధానం సున్నత్ వైపుకు మరలాలి. అల్లాహ్ మనందరిని బిద్ అత్ పనుల నుండి రక్షించుగాక..

**సోదరులారా..!**

మీరు విన్నట్లుగానే ముస్లిం సమాజంలో ప్రతి మాసం ఎన్నో బిద్అత్‌లు చెలామణిలో ఉన్నాయి. ఆచరణలో ఉన్నాయి. ఫంజా, ఫాతిహా, చహ్‌లుమ్, చిల్లా, ముహర్రమ్ తాజియా, షబేబరాత్, మీలాదున్నబీ, ఉర్సులు ఇలాంటి ఎన్నో ముస్లిం సమాజంలో తిష్టవేసి ఉన్నాయి. ఇలాంటి కార్యాలన్ని బిద్అత్ కార్యాలే దైవ ప్రవక్త(స) తన అనుచరసంఘానికి బిద్అత్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. బిద్అత్ చాలా చెడ్డది. బిద్అత్ ఎంత చెడ్డదో నీచమైందో దైవ ప్రవక్త (స) ఖుత్బా వింటే తెలుస్తుంది. ప్రతి ఖుత్బాలో దైవప్రవక్త (స) ఇలా హెచ్చరించేవారూ వారించే వారు:

> **"ప్రజలారా గుర్తుంచుకోండి! మీకోసం అత్యుత్తమ గ్రంథం అల్లాహ్ గ్రంథం ఖుర్ఆన్ మజీద్. మీకోసం అత్యుత్తమ విధానం దైవ ప్రవక్త (స) ముహమ్మద్ (స) విధానం షరీఅత్‌లో కొత్త పనులు చేయటం అత్యంత చెడ్డపని. ప్రతి కొత్త పని బిద్అత్ ప్రతి బిద్అత్ (నవీన పోకడలు) మార్గభ్రష్టం ప్రతి మార్గభ్రష్టత నరకానికి దారి తీస్తుంది."**

బిద్అత్ కార్యం నరకానికి మూలకారణమని దైవ ప్రవక్త (స) ప్రవచనం ద్వారా స్పష్టంగా బోధపడుతుంది. కాబట్టి ముస్లిం సోదరులు బిద్అత్ కార్యాలకు బహుదూరంగా ఉండాలి. అలాంటి కార్యాలను విడనాడాలి. బిద్అత్ గురించి దైవ ప్రవక్త (స) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు:

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: అల్లాహ్ దృష్టిలో 3 రకాల వ్యక్తులు చాలా చెడ్డవారు, శాపగ్రస్తులు, వారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుంది.

1) అల్లాహ్ గృహం కాబాలో దౌర్జన్యం చేసేవాడు అధర్మానికి పాల్పడేవాడు.
2) ఇస్లాం ధర్మంలో అజ్ఞానకాల సంప్రదాయాలను, దురాచారాలను అంటే బిద్అత్‌లను ప్రవేశపెట్టేవాడు.

3) అన్యాయంగా, దౌర్జన్యంగా తన ముస్లిం సోదరున్ని హతమార్చినవాడు

(సహీహ్ బుఖారీ)

ఈ హదీసు ద్వారా ఇస్లామీయ షరీఅత్‌లో లేని కొత్త విషయాలను చేర్చేవాడు అల్లాహ్ దృష్టిలో అతి నికృష్ఠుడు పాపాత్ముడని బోధపడుతుంది.

**సోదరులారా..!**

సఫర్ మాసపు దురాచారాలు గాని, మిగతా మాసాల బిద్‌అత్‌లు గాని పూర్తి ముస్లిం సమాజాన్ని సామాజికంగా ఆర్థికంగా నాశనం చేస్తాయి. ఎందుకంటే ఈ నవీన పోకడల కోసం ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. సందల్, ఉర్సు, గ్యార్వీ, సత్తర్వి అని ఇలా ప్రతి బిద్‌అత్‌కు ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. ఒక వేళ ఆ డబ్బునే ముస్లింల విద్యకు, ధర్మ ప్రచార కార్యాలకు వెచ్చిస్తే ఎంత బాగుండు! కాని ముస్లింలు తమ కళ్ళపై తెర వేసుకొని (లకీర్ కీ ఫకీర్) అయి ఏది నచ్చితే అదే చేసుకుంటూ పోతున్నారు. అత్యంత విచారకర విషయం ఏమిటంటే అలాంటి వారికి ఆ కార్యాలను గురించి, బిద్‌అత్ గురించి ప్రేమగా తెలుపుతున్నా అర్థం చేసుకోవడం లేదు. పైగా చెప్పేవారినే దూషిస్తారు.

నేడు ముస్లిం సమాజం అజ్ఞానం అపమార్గంలో మునిగితేలుతుంది. ఎంత వైద్యం చేస్తున్నా రోగం పెరుగుతూనే ఉంది. అన్నట్టు ఎంత వారిస్తున్నా, బోధ చేస్తున్నా వారుతమ వ్యాధిని గుర్తించటం లేదు. కాని దైవ ప్రవక్త (స) అన్ని రకాల వ్యాధులకు, విభేదాలకు ఒక మంచి మార్గాన్ని వైద్యాన్ని చూపారు. దైవ ప్రవక్త (స) తన జీవిత చివరి కాలంలో చేసిన వీడ్కోలు హజ్‌లో దాదాపు ఒకటిన్నర లక్షల అనుచర సంఘాన్ని ఉద్దేశించి చేసిన వసియ్యత్ అది ఆయన (స) ఇలా సెలవిచ్చారు.

**అనుచరులారా..!**

మీ మధ్య నేను మీకోసం రెండు వస్తువులను విడిచివెళ్తున్నాను. ఆ రెండింటిని దృఢంగా పట్టుకున్నంతవరకు మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ మార్గభ్రష్టులు కాలేరు. అవి దైవగ్రంథం ఖుర్ఆన్ నా విధానం-సున్నత్.

**ధార్మిక సోదరులారా..!**

సఫర్ మాసమే కాకుండా రబీవుల్ అవ్వల్‌లో ఈదె మీలాదున్నబీ, బారా వఫాత్, గ్యారవీ పేరుతో హజ్రత్ ఖాజా బగ్దాదీ పేర సత్తర్వా చేయటం ఇత్యాది

teluguislam.net



వన్నింటికీ ఇస్లామీయ షరిఅత్ లో ఎలాంటి స్థానం లేదు. సత్యవంతుల కాలంలో ఇలాంటి ఆచారాలు, నమ్మకాలు, పండుగలు లేవు. ఇలాంటి కార్యాలతో దైవ ప్రవక్త (స) వారి అనుచరులు, వారి శిష్యులు, నలుగురు ఇమాములకు ఎలాంటి సంబంధము లేదు. ఇస్లామీయ షరిఅత్తో సంబంధంలేని కొత్తకొత్త పనులు చేయటం షరీఅత్తో చెలగాటం, పరిహాసం అవుతుంది. షరీఅత్ను ఎగతాళి చేసే వ్యక్తి స్వర్గానికి అర్హత పొందగలడా అన్నది ఆలోచించాల్సిన విషయం.

అంతిమ దైవ ప్రవక్త (స) విధానం సున్నత్ స్వర్గానికి చేరుస్తుంది. ఆయనతో సంబంధంలేని విషయాలు, బిద్అత్లు నరకంలో నెట్టివేస్తాయి.

**సోదరులారా!**

కాబట్టి ఇతరులకు ధర్మాన్ని బోధించే ముందు మన ఇంటిని ప్రవక్త (స) విధానానికి అనుగుణంగా తీర్చి దిద్దుకుందాం. బిద్అత్ లకు బహూదూరంగా ఉందాం. ఇతరులకు ఈ విషయాలు చెప్పి సున్నత్కు ప్రాణం పోద్దాం. దైవ ప్రవక్త (స) అడుగుజాడల్లోనే సదా నడుద్దాం.

అల్లాహ్ మనందరికి బిద్అత్ నుండి కాపాడుకునే సద్బుద్ధిని అనుగ్రహించు గాక ఆమీన్..